క్లుప్తంగా

విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగింపు తక్షణమే ఆపాలి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రభాకర్ రెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల భారాన్ని తక్షణమే ఆపకపోతే పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కే. ప్రభాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం సీపీఎం జిల్లా కార్యాలయంలో జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలు పెంచడం లేదంటూనే వినియోగదారుల జేబులకు కత్తెరవేసే టైం ఆఫ్ డే టార్ప్ విధానాన్ని చిరు వ్యాపారులకు సైతం అమలు చేస్తామని ప్రకటించడం దారుణమని తీవ్రంగా విమర్శించారు. ఈ విధానాన్ని అనుమతించొద్దని సిపి ఎం పార్టీ పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేసిందన్నారు. ట్రూ అప్ చార్జీలు, ఇంధన సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జి చంద్రశేఖర్, కార్యదర్శి వర్గ సభ్యులు ఏ రా మ్మోహన్, మనోహర్, అన్వేష్, శివకుమార్, జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరి రెడ్డి, శ్రీనివాసుల రెడ్డి, చాంద్ బాషా, శ్రీనివాసులు, లక్ష్మీదేవి, గౌసియా బేగం, పార్టీ శాఖ కార్యదర్శులు బైరవ ప్రసాద్, రమణ, నరసయ్య, వెంకటేశ్వ ర్లు , ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అన్నదానం



కడప అర్బన్: అమావాస్య పురస్కరించుకుని గుప్తదాత విన్నపం మేరకు హిమ వర్షిణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ దగ్గర ఉండే ప్రేమాలయ నిరాశ్రయుల నివాస వసతి గృహంలో నిరాశ్రయులకు, వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి, పుట్టా పురుషోత్తం, రెడ్డి లక్ష్మణ్, టైలర్ రవి, ఆశ్రమ నిర్వాహకులు శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

కవి చక్రవర్తి గుర్రం జాషువా

కడప సెవెన్‌రోడ్స్ : పేదరికం, అస్పృశ్యత, మూఢ ఆచారాలపై తిరుగుబాటు చేసిన విశ్వకవి గుర్రం జాషువా అని వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. గురువారం కడప నగరంలోని రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో గుర్రం జాషువా వర్ధంతిని నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రంగస్థల నటులు ప్రకాశ్, దేవరశెట్టి గంగయ్య, విశ్రాంత తెలుగు అధ్యాపకులు సత్యనారాయణ, హార్మోనిస్టు రామలింగయ్య, కళాకారులు బాల గంగయ్య, గడికోట రెడ్డెయ్య తదితరులు పాల్గొన్నారు.

యువత రక్తదానం చేయాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని నగరానికి చెందిన పఠాన్ మహమ్మద్ రఫీ పిలుపునిచ్చారు. గురువారం రఫీ జన్మదినాన్ని పురస్కరించుకుని కడప నగరం అక్కాయపల్లెలో ఎస్ఆర్‌పీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 86 మందికి పైగా యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో రఫీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు షబ్బీర్, ప్రదీప్, సీకే దిన్నె శ్రీను పాల్గొన్నారు.

కడప ఉక్కుపై ఎంపీలు గళం విప్పాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాలలో రాష్ట్రంలోని ఎంపీ లు కడప ఉక్కు పై గళం విప్పాలని, తదనంతరం ఉక్కు కు నిధులు రాబట్టాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ తెలిపారు. గురువారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రం కడప ఉక్కు పైన నిర్లక్ష్యం వహిస్తున్నదన్నారు. సంవత్సరాలు గడుస్తున్నా ఇచ్చిన హామీ ఇంత వరకు అమలు కాలేదన్నారు. ఉక్కు ను ఎన్నికల హామీగానే చూస్తున్నారు కానీ వేల మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించే పరిశ్రమ ఏర్పాటుకు ఎందుకు చర్యలు చేపట్టడం లేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బా.నరసింహులు,నగర కార్యదర్శి విజయ్,జిల్లా కమిటీ సభ్యులు విశ్వనాథ్,జిల్లా నాయకులు సునీల్ పాల్గొన్నారు.

వీరభద్రుడికి విశేష పూజలు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామికి అమావాస్య పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం అమావాస్య కావడంతో ఆలయ ఈఓ డి.వి.రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు శంకరయ్యస్వామి, కృష్ణస్వామి, శేఖర్ స్వామి, రాచరాయ యోగీ స్వామి, మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో అభిషేకాల, పూజలు నిర్వహించి అందంగా అలంకరించి పల్లకిలో ఉంచి ఊరేగించారు.

చౌడేశ్వరీ దేవికి విశేష పూజలు



ప్రత్యేక అలంకారంలో శ్రీ చౌడేశ్వరీదేవి



పూజలు చేసేందుకు ఆలయానికి తరలివస్తున్న భక్తులు



ఆలయం వద్ద భక్తులకు అన్నదానం

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరం ఎర్రముక్కపల్లెలో గురువారం చౌడేశ్వరీదేవి జయంతి మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజామున 4.30 గంటలకు అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పుష్పాలంకారం చేసి అమ్మవారి దర్శన భాగ్యం భక్తులకు కల్పించారు. ఉదయం 8.00 గంటలకు కొత్త శివాలయం నుంచి 108 మంది ముత్తయిదువులు కలశాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ గావించారు. ఉత్సవాలను ఆలయ కమిటీ అధ్యక్షులు కల్యా సుధాకర్ పర్యవేక్షించారు.

నబీకోటలో...



భక్తులకు దర్శనమిస్తున్న రామలింగ చౌడేశ్వరీ మాత

కడప అర్బన్: కడప నగరంలోని నబీకోటలో చౌడేశ్వరి దేవి జయంతి ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పూలతో అలంకరణ నిర్వహించారు. ముత్తయిదువులు కలశాలతో శివాలయం నుండి నీళ్లు తెచ్చి అమ్మవారికి జలాభిషేకం చేశారు. ఆలయ కమిటీ నాయకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశా రు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు శరంతు శ్రీనివాసులు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, యువజన సంఘం ఆధ్వర్యంలో శరంతు అంజి టీమ్, ముఖ్య అతిథులుగా కార్పొరేటర్లు పాకా సురేష్, వెల్లాల రామకృష్ణారెడ్డి, రెడ్డి ప్రసాద్, తో పాటు రెడ్డి హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయడమే అందరి లక్ష్యం



రాష్ట్ర మైనార్టీ విభాగంలో పదవులు పొందిన వారిని సన్మానిస్తున్న టీటీడీ బోర్డు మాజీ సభ్యులు

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే అందరి లక్ష్యం కావాలని టీటీడీ బోర్డు మాజీ సభ్యులు మాసీమ బాబు అన్నారు. గురువారం రాష్ట్ర మైనార్టీ విభాగంలో పదవులు పొందిన చాక్లెట్ గౌస్, అక్బర్, ఇతర మైనార్టీ నాయకులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాసీమ బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విభజించు, పాలించు రీతిలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తోందని, పార్టీ నాయకులంతా ఐక్యంగా ఉండి అక్రమ కేసులను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు షంషీర్, అరీపుల్లా బాషా, కో ఆప్షన్ సభ్యుడు జహీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు జమాల్‌వలీ, మున్నా, శ్రీరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూల్చివేతలో మా ప్రమేయం లేదు

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరం కొత్త మార్కెట్ సమీపానగల హజరత్ ఖాసిం మోహిద్దీన్ దర్గా ప్రాంగణంలో తామే ముతవల్లీలమంటూ కొందరు రూము, వసరా వేసుకున్నారని, వాటి తొలగింపులో తమ ప్రమేయం ఏమి లేదని పెద్దదర్గా ముజావర్ అమీరుద్దీన్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా అక్కడ నిర్మాణాలు చేయడంతో స్థానికులు అడ్డుకుని జిల్లా రెవెన్యూ అధికారికి ఫిర్యాదు చేశారని, ఇందులో పెద్ద దర్గా మేనేజర్ ప్రోద్బలం లేదన్నారు. కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి ఈ అంశాన్ని పర్యవేక్షించి అక్రమ కట్టడాలు ఆపివేయాలని, కట్టిన వారే స్వంత ఖర్చులతో ఆ నిర్మాణాలను తొలగించాలంటూ చెప్పడంతో డీఆర్వో ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. దీంతో సోషల్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, ప్రింట్ మీడియా ద్వారా పెద్దదర్గా మేనేజరే కారణమంటూ నిందించడం సరికాదన్నారు. వక్ఫ్ ఆస్తి ఆక్రమణకు గురైంది కాబట్టే డీఆర్వో, జిల్లా వక్ఫ్ ఇన్‌స్పెక్టర్ వాటిని తొలగించాలంటూ ఆదేశాలు ఇచ్చారన్నారు. గౌసియా అనే మహిళను ఎక్కడా దర్గా ముతవల్లీ అని అధికారులు పొందుపరచ లేదని తెలిపారు.

ఘనంగా కూష్మాండ దీప పూజలు



కడప సెవెన్‌రోడ్స్ : కడప నగర శివార్లలోని బాసట స్వచ్ఛంద సేవా సంస్థ దత్తత గ్రామమైన కాలభైరవపురం (ఎంఎస్ కొట్టాల)లోని శ్రీ ఇష్టకామ్యార్థ కాలభైరవస్వామి దేవస్థానంలో గురువారం అమావాస్య కుష్మాండ దీప పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి పంచామృతాభిషేకం, అష్టోత్తరం, కూష్మాండ దీప సేవారాధన, ఇతర పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అర్చకుడు శ్రీధర్ శర్మతోపాటు ఆలయ నిర్వాహకులు డీఏ కార్తీక్‌రెడ్డిలు మాట్లాడుతూ అమావాస్య రోజున కాలభైరవ స్వామిని దర్శించడం వల్ల సకల శుభాలు కలుగుతాయని తెలిపారు.

శిక్షణ అంశాలను రైతులకు చేరవేయాలి

– కేవీకే కో ఆర్డినేటర్ వీరయ్య



మాట్లాడుతున్న కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య

కడప అగ్రికల్చర్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సభ్యులు సమగ్ర పోషక యాజమాన్యంపై శిక్షణలో నేర్చుకున్న అంశాలను రైతులకు చేరవేయాలని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్ర కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య సూచించారు. ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో సస్యరక్షణ శాస్త్రవేత్త డా. వి. శిల్పకళ ఆధ్వర్యంలో ఈ నెల 10 నుండి 24 వరకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు సమగ్ర పోషక యాజమాన్యంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమాలు గురువారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో కేవీకే కో ఆర్డినేటర్ డా. ఎ. వీరయ్య మాట్లాడుతూ ఈ 15 రోజులలో శిక్షణా కార్యక్రమాన్ని తరగతి గదిలోనే కాకుండా విజ్ఞాన యాత్రలో కొన్ని ప్రాంతాలను సందర్శించారన్నారు. జిల్లా సహకార సంఘ ప్రతినిధి వెంకట సుబ్బయ్య, ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డా. కే. అంకయ్య కుమార్, వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి డా.జి.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ పోషకాలు వాటి విలువలు తెలిసినపుడే వ్యవసాయంలో ఎరువుల వాడకం అనేది ఖచ్చితమైన విధంగా జరుగుతుందన్నారు. అలాగే ఏ ఏ పంటలకు ఎంత శాతం ఎరువులు అవసరమో ఈ శిక్షణా కార్యక్రమం ఉపయోగ పడుతుందని అన్నారు. నిష్ణాతులైన శాస్త్రవేత్తలచే శిక్షణ తరగతులు, ప్రాక్టికల్స్ నిర్వహించడంతో మంచి విజ్ఞానాన్ని పొందినందుకు అభినందించారు. ఈ జ్ఞానాన్ని రైతులకు చేరవేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, ప్రాథమిక సహకార సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పీఎఫ్‌ను అకౌంటుకు జమ చేయాలి



జెడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌టీఏ నాయకులు

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి 2022 జనవరి నెల పీఎఫ్ ప్రీమియం ఇంతవరకు జమచేయలేదని వెంటనే జమచేయాలని పీఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్ రెడ్డి, వైఎస్సార్‌టీఏ రాష్ట్ర నాయకులు సజ్జల రమణారెడ్డిలు కోరారు. గురువారం ఈ విషయమై వారు జిల్లా పరిషత్తు చైర్మెన్ రామగోవిందరెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. రామ గోవిందరెడ్డి స్పందించి ప్రావిడెంట్ ఫండ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ నాగిరెడ్డి, విజయభాస్కర్ రెడ్డిలను పిలిపించి ప్రీమియంను వెంటనే ఉద్యోగ ఉపాధ్యాయుల అకౌంట్‌కు జమ చేయాలని ఆదేశించారు. అనంతరం జిల్లా పరిషత్తు చైర్మన్‌ను పీఎస్‌టీయూ, వైఎస్ఆర్‌టీఏ నాయకులు లెక్కల జమాల్‌రెడ్డి, సజ్జల రమణారెడ్డి, వెంకట్ నాథ్ రెడ్డి, రమేష్, అమర్నాథరెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి , కిరణ్ కుమార్ రెడ్డి శాలువాతో సన్మానించారు.


ప్లాస్టిక్ రహిత వస్తువులకు ప్రాధాన్యం ఇవ్వాలి



తయారు చేసిన ప్లాస్టిక్ రహిత వస్తువులతో విద్యార్థులు, అధ్యాపకులు

కడప ఎడ్యుకేషన్: స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ రహిత వస్తువులకే ప్రాధాన్యం ఇవ్వాలని కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సలీంబాషా సూచించారు. గురువారం కళాశాలలో డిపార్టుమెంట్ ఆఫ్ బోటనీ హెడ్ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్లాస్టిక్ రహిత క్రాఫ్ట్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్లాస్టిక్ నిషేధంపై పలు కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. ఇందులో భాగంగానే విద్యార్థులకు ప్లాస్టిక్‌ను ఉపయోగించకుండా అందమైన అలంకరణకు ఉపయోగించే వివిధ రకాల క్రాఫ్ట్ కాంపిటీషన్స్‌ను నిర్వహించామన్నారు. ఈ పోటీలలో విజేతలైన ముగ్గురు విద్యార్థులకు ఆగష్టు 15వ తేదీన బహుమతులను ప్రదానం చేస్తామని తెలిపారు. ఎన్ఆర్‌సీ కోఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి , ఐక్యూఏసీ కోఆర్డినేటర్ కృష్ణవేణి, బాటనీ అధ్యాపకులు నాగరత్నమ్మ, అనురాధ, విద్యార్థులు పాల్గొన్నారు.

అంధకారంలో జాతీయ రహదారి



ఊటుకూరు వద్ద వెలగని విద్యుత్ దీపాలు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కర్నూలు –చిత్తూరు జాతీయ రహదారిలోని ఊటుకూరు ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి జాతీయ రహదారి డివైడర్ లపై ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో అంధకారం నెలకొన్నది. దీంతో రాత్రి సమయంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారి డివైడర్ల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు కొన్ని మాత్రమే వెలుగుతూ మరికొన్ని మాత్రం మరమ్మత్తులకు గురయ్యాయి. దీంతో కార్పొరేషన్ అధికారులు విద్యుత్ దీపాలను మరమ్మతులు చేయకపోవడంతో అంధకారం నెలకొంది. దీంతో ద్విచక్ర వాహనాలు దారులు ఎదురుగా వస్తున్న వాహనం కనపడక ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి విద్యుత్ దీపాలకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

పాత పెన్షన్ అమలు చేయాలి



మంత్రులకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న వెంకట జనార్దన్ రెడ్డి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రంలో 2003 డీఎస్సీ అభ్యర్థులకు పాత పెన్షన్ అమలు చేయాలని ఏపీ సీపీఎస్ ఈఏ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి వెంకట జనార్దన్ రెడ్డి కోరారు. ఈ విషయమై గురువారం రాష్ట్ర సచివాలయంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ , రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌లను ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి, ఏపీ సీపీఎస్ఈఏ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్సార్ వెంకట జనార్ధన రెడ్డి కలిశారు. ఈ మేరకు 2003 డీఎస్సీ ఫోరం సభ్యులతో కలిసి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో 2003 డీఎస్సీ ఫోరం రాష్ట్ర కార్యదర్శి ఉమ్మడి రవీంద్ర రెడ్డి, జిల్లా కన్వీనర్లు కురుకుటి సుధాకర్, రిజ్వానలి, ప్రొద్దుటూరు నియోజకవర్గం బాధ్యులు అచ్చుకట్ల చాంద్ బాషా, అనంతపురం జిల్లా కన్వీనర్ గజ్జల ప్రభాకర్, ప్రకాశం జిల్లా కన్వీనర్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం స్వీయ ఆరోగ్యానికి ప్రయోజనకరం



రక్తదాతలను అభినందిస్తున్న అతిథులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : రక్తదానం ఒకరి ప్రాణాలు కాపాడేదే కాకుండా మన ఆరోగ్యానికి ప్రయోజనకరమని ఎస్వీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి తెలిపారు. వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లా స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా రక్త వారోత్సవాల రెండో వార్షికోత్సవ వేడుకలో ఐదవ రోజు కడపలోని ఎస్వీ డిగ్రీ కాలేజీలో చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రిన్సిపాల్ సుధాకర్ ప్రారంభించారు. డాక్టర్ ఓవీ రెడ్డి , శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ మేనేజర్ శివ శంకర్ రెడ్డి, కడప హెల్పింగ్ స్క్వాడ్ వ్యవస్థాపకుడు అబ్దుల్ రెహమాన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, జేపీవీఎస్ సంస్థ వ్యవస్థాపకుడు అశోక్, సభ్యులు పాల్గొన్నారు.

సంఘీభావం



మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న టీటీడీ బోర్డు సభ్యులు

కడప కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులో అరెస్టై బెయిల్‌పై విడుదలైన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే ఆర్. రమేష్ కుమార్‌రెడ్డికి టీటీడీ బోర్డు మాజీ సభ్యులు మాసీమ బాబు సంఘీభావం ప్రకటించారు. గురువారం లక్కిరెడ్డిపల్లెలోని వారి స్వగృహంలో ఆయన్ను కలిసి పలు అంశాలపై చర్చించారు. కూటమి తప్పులను దీటుగా ఎత్తిచూపినందుకు అభినందిస్తూ గజమాలతో సత్కరించారు.

ప్రభుత్వ పాఠశాలలో తాగునీటి సమస్య

సిద్దవటం : మండలంలోని తురకపల్లె గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నెలరోజులుగా విద్యార్థులకు తాగునీరు సమస్య ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని గురువారం వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో తాగునీటి సమస్య లేకుండా పరిష్కరించాలని వారు కోరారు. పాఠశాల ఉపాధ్యాయుడు అక్బర్‌బాషా మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులు 10 మంది ఉన్నారన్నారు. తాగునీటి సమస్య అయితే పాఠశాలలో ఉందన్నారు. విద్యార్థులు ఇంటి వద్ద నుంచే తాగునీరు తెచ్చుకుంటున్నారని చెప్పారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని పాఠశాల కమిటీ వారికి వివరించామని ఆయన అన్నారు. ఈ విషయమై ఎంఈఓ-2 అరుణను వివరణ కోరగా గ్రామ సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లి పాఠశాల విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పిస్తానని పేర్కొన్నారు.

అబద్ధపు హామీలతో చంద్రబాబు మోసం



ఉలవలపల్లెలో బాబు మోసాన్ని ప్రజలకు వివరిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి పి.నరేన్‌రెడ్డి

పెండ్లిమర్రి : అబద్ధపు హామీలు ఇచ్చి అన్ని వర్గాల ప్రజలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మోసం చేశాడని వైఎస్సార్‌సీపీ కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పి.నరేన్ రామాంజులరెడ్డి మండిపడ్డారు. గురువారం ఉలవలపల్లెలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమణారెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ పై ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించారు. 13 నెలల పాలనలో సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడంతో ప్రతి కుటుంబానికి ఎంత నష్టం జరిగిందో ప్రజలకు గుర్తు చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగిరెడ్డి, రాజారెడ్డి, సుబ్బరామిరెడ్డి, రామాంజనేయరెడ్డి, వెంకట శివారెడ్డి, నాగేంద్రారెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, నాగమల్లారెడ్డి, వీరారెడ్డి, రామమోహన్‌రెడ్డి, చావలి శివ, రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం తప్పనిసరి

పులివెందుల రూరల్ : మానవాళి మనుగడకు ప్రకృతి వ్యవసాయం తప్పనిసరి అని వ్యవసాయ శాఖ ఏడీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక అంబకపల్లె రోడ్డులో ఉన్న మినీ సెక్రటేరియట్‌లో రైతు సేవా సిబ్బందికి ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ గ్రామస్థాయిలో రైతులలో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తారంగా ముందుకు తీసుకెళ్లాలన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. హెచ్‌ఓ రాఘవేంద్రారెడ్డి మాట్లాడుతూ ఏక పంట విధానానికి స్వస్తి పలికి పలు పంటల సాగు విధానంపై దృష్టి సారించాలన్నారు. పలు పంటల విధానంవల్ల బహుళ ప్రయోజనాలు ఉంటాయన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలు

కమలాపురం : ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన పంటలు పండించవచ్చని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఏడీఏ కార్యాలయంలో కమలాపురం, వల్లూరు మండలాల ఆర్ఎస్‌కే సిబ్బందికి, ప్రకృతి వ్యవసాయం సిబ్బందికి మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మొదటి రోజు ఈవీసీ విజయ్‌కుమార్ వర్చువల్ మీటింగ్ ద్వారా ప్రకృతి వ్యవసాయం యొక్క ఆవశ్యకతను, ప్రాముఖ్యతను, (సైన్స్ బిహైండ్ నేచురల్ ఫామింగ్) వివరించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం పట్ల రైతులను మోటివేట్ చేయాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం ప్రవీణ్‌కుమార్, అడిషనల్ డీపీఎం వసంతకుమారి, ఏఓలు సరస్వతి, కిరణ్ కుమార్‌రెడ్డి, ఏడీఏ(డీఆర్‌సీ) అశోక్‌రెడ్డి, ఏఓ సుచిత్ర, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.